క్లుప్తంగా

బహిరంగ వేలం 14కు వాయిదా

తగరపువలస : జీవీఎంసీ 3వ వార్డులోని రోడ్డు మార్జిన్లు, లాల్ బహదూర్ శాస్త్రి, కలిగొట్ల సూర్యనారాయణ నాయుడు మార్కెట్లలో రోజువారీ వసూళ్లకు సంబంధించి బహిరంగ వేలం ఈ నెల 14న ఉదయం 11 గంటలకు వాయిదా వేసినట్టు జెడ్సీ కనకమహాలక్ష్మి తెలిపారు. వీటి హక్కు కాల పరిమితి 2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు ఉంటుందన్నారు. అలాగే బీచ్‌రోడ్డులో జీవీఎంసీ షాపులు మూడేళ్ల కాల పరిమితితో లీజుకు ఇవ్వడానికి కూడా అదే రోజు బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు ధరావత్తు సొమ్ము డ్రాఫ్ట్ లేదా చెక్కుతో బహిరంగ వేలంలో పాల్గొనాలని ఆమె కోరారు.

ఇళ్ల రిజిస్ట్రేషన్ పట్టాలు పంపిణీ



లబ్ధిదారులకు పట్టాలు అందజేస్తున్న మజ్జి వెంకటరావు, బీఆర్‌బీ నాయుడు

ఆనందపురం : మండలంలోని తర్లువాడలో సోమవారం నవరత్నాలలో భాగంగా పేదలందరికీ ఇళ్లు పథకం కింద రిజిస్ట్రేషన్ చేసిన ఇళ్ల పట్టాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. స్థానిక సర్పంచ్ బీఆర్‌బీ నాయుడు, మాజీ సర్పంచ్ మజ్జి వెంకటరావు 175 మందికి పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదల కోసం అందిస్తున్న ఇళ్ల పట్టాలను దుర్వినియోగం చేయరాదన్నారు. అందరూ పక్కా ఇళ్లు నిర్మించుకొని నివసించాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్వో కృష్ణవేణి, పంచాయతీ కార్యదర్శి సూర్యాదేవి, తదితరులు పాల్గొన్నారు.

జేవీ అగ్రహారంలో 160 మందికి ...



పట్టా అందిస్తున్న నాయకులు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు జేవీ అగ్రహారంలో వన్ సెంట్ ఇళ్ల స్థలం రిజిస్ట్రేషన్ పట్టాలు 160 మందికి అందజేశామని వార్డు క్లస్టర్ ఇన్‌చార్జి బోర రామకృష్ణ తెలిపారు. పేదల సొంతింటి కళ సాకారం కావాలనేది ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆశయమని, అందులో భాగంగానే రాష్ట్రంలో సుమారు 35 లక్షల మందికి పట్టాలు అందజేశారని పేర్కొన్నారు. స్థానిక నాయకులు అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

'అవంతి'లో వర్క్‌షాప్ ప్రారంభం



వర్క్‌షాప్ ప్రారంభంలో మాట్లాడుతున్న కన్వీనర్ శ్రీలక్ష్మి

తగరపువలస : చెరకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో నాలుగు రోజులపాటు జరగనున్న డేటా సైన్స్ యూజింగ్ పైథాన్ వర్క్‌షాపు సోమవారం ప్రారంభమైంది. బ్రెయిన్ ఒ విజన్ సంస్థ సహకారంతో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్‌కు సంబంధించి ఈ వర్క్‌షాపులో చర్చించనున్నారు. కన్వీనర్‌గా సీఎస్ఈ విభాగాధిపతి పి.శ్రీలక్ష్మి వ్యవహరించనునున్నారు.

కార్యక్రమంలో ఫ్యాకల్టీ కో ఆర్డినేటర్లు పి.సుదర్శనరావు, జి.రమాదేవి, డైరెక్టర్ ఆకుల చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ బి.మురళీకృష్ణ తదితరులు మాట్లాడుతూ విద్యార్థులు జ్ఞానాన్ని, నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని భవిష్యత్‌లో మంచి ఉద్యోగాల సాధనకు ఈ వర్క్‌షాప్ దోహదపడుతుందని పేర్కొన్నారు.

సీఎం జగన్‌తోనే సుపరిపాలన

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

పీఎం పాలెం : రాష్ట్రంలోని బడుగు బలహీన వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం పాటుపడిన సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదర్శ పాలనకు మహిళా లోకం జేజేలు పలుకుతోందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 7వ వార్డు వాంబేకాలనీలో చేయూత లబ్ధిదారులకు చెక్కులు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 7వ వార్డులోని 1,413 మంది లబ్ధిదారులకు నాలుగో విడతలో రూ.2.65 కోట్లు అందజేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ ఇంతకంటే మెరుగైన సంక్షేమ పాలనను మరే ఇతర పార్టీల నాయకులు అందించగలరన్న నమ్మకం లేదని సభాముఖంగా స్పష్టం చేశారు. విద్యార్థులకు జగనన్న గోరు ముద్ద, అమ్మ ఒడి, చేయూత, ఆసరా, పింఛన్లు, ఇళ్ల పట్టాలు పంపిణీ, తదితర ప్రజా సంక్షేమ పథకాలు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి విజయవంతంగా అమలు చేశారని కొనియాడారు. భీమిలి ఎమ్మెల్యేగా ముత్తంశెట్టి శ్రీనివాసరావును రానున్న ఎన్నికల్లో అధిక మెజారిటీతో గెలిపించడం ద్వారా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిని చేసుకుంటామని ఘంటాపథంగా చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర నగరాలు కార్పొరేషన్ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు, స్థానిక నాయకులు వంకాయల మారుతీ ప్రసాద్, కుడితి రామారావు, పిళ్లా సూరిబాబు, రజని, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



జీవీఎంసీ 7వ వార్డు వాంబే కాలనీలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు తెలుపుతున్న మహిళలు

పేదలకు, పెత్తందారులకు మధ్యే ఎన్నికల యుద్ధం

కొమ్మాది : రానున్న సార్వత్రిక ఎన్నికలు పేదలకు, పెత్తందారులకు మధ్య జరిగే మహా సంగ్రామమే అని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్‌లో వైఎస్సార్ చేయూత చెక్కు పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా రూ.1.98 కోట్ల చెక్కు లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి మరలా అధికారంలోకి వస్తేనే పేదలకు లబ్ధి చేకూరుతుందన్నారు. పొరపాటున చంద్రబాబు అధికారంలోకి వస్తే పెత్తందారులకు లబ్ధి చేకూరుతుందన్నారు. 40 సంవత్సరాల అనుభవం అని చెప్పుకునే చంద్రబాబు నాయుడు ఏనాడూ బీసీలను, మహిళలను పట్టించుకోలేదని ఆరోపించారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళా సాధికారతకు ప్రాధాన్యమిచ్చామన్నారు. అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లుగా పాలన సాగిస్తున్నామని పేర్కొన్నారు. భీమిలి నియోజకవర్గంలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారులకు రూ.2,221 కోట్లు అందించామని తెలిపారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకే ఓటు వేసి అఖండ మెజారిటీతో తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ లొడగల అప్పారావు, వైఎస్సార్ సీపీ వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి, నాయకులు లొడగల రామ్మోహన్, అల్లాడ ఉమామహేశ్వరరావు, మాదు చంటి, నొడగల రాంబాబు, దువ్వి వాసు, రమణ మూర్తి, చిల్లా సురేష్ రెడ్డి, బాలకృష్ణ పాల్గొన్నారు.

ప్రతిపక్షాల దుష్ప్రచారంపై మహిళల ఆగ్రహం

పీఎం పాలెం : స్థానిక అవంతి ఫంక్షన్ హాలు ఆవరణలో సోమవారం సాయంత్రం నిర్వహించిన చేయూత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో స్థానిక మహిళలు టీడీపీ, జనసేన నాయకులపై దుమ్మెత్తి పోశారు. సీఎం జగనన్న పాలనలో తాము పొందిన లబ్ధిని తమ జీవితకాలంలో ఎన్నడూ చూడలేదని ఆనందం వ్యక్తం చేశారు. తాము పొందిన ప్రయోజనాలు ఉద్వేగంతో వ్యక్తం చేయడం చూసిన ఎమ్మెల్యే మెత్తంశెట్టి శ్రీనివాసరావు ఆ మహిళలను అభినందించారు. టీడీపీ, జనసేన నాయకులు ప్రజలకు ఏం చేశారని ఓట్లు అడుగుతారని మహిళలు ప్రశ్నించారు. సీఎం జగన్‌పై, రాష్ట్ర ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. సోమవారం సాయంత్రం జీవీఎంసీ 6వ వార్డులోని లబ్ధిదారురులకు చేయూత చెక్కు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ నాలుగో విడత చేయూత పథకం కింద 1,687 మంది లబ్ధిదారులకు రూ.3.16 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. కార్పొరేటర్ లక్ష్మీ ప్రియాంక మాట్లాడుతూ వార్డులో రెండు అర్బన్ ప్రాథమిక ప్రభుత్వ ఆస్పత్రులు నిర్మించామని తెలిపారు. రూ.200 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు, సియ్యాద్రి అప్పలరాజు, పోతిన యల్లాజీ, జామి శివకుమార్, పోతిన సూరిబాబు, వీవీ నరసింహరావు, గాయత్రినగర్ అప్పారావు పాల్గొన్నారు.



రుషికొండ సభలో ఎన్నికలకు సిద్ధం అంటున్న మహిళలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



వాంబేకాలనీలో మహిళలకు చేయూత చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



పీఎం పాలెం సభలో ఎమ్మెల్యే శ్రీనివాసరావు, కార్పొరేటర్ లక్ష్మీ ప్రియాంక, స్థానిక నాయకులు

కానిస్టేబుళ్లకు రివార్డులు



కానిస్టేబుల్‌ను అభినందిస్తున్న సీఐ తిరుపతిరావు

ఆనందపురం : సక్రమంగా విధులు నిర్వహించిన కానిస్టేబుళ్లకు స్థానిక సీఐ టీటీ తిరుపతిరావు రివార్డులు అందజేసి అభినందించారు. పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సివుండగా... ఆనందపురం పోలీస్ స్టేషన్‌లో అలాంటివి 3 శాతమే నమోదు చేశారు. ఈ క్రమంలో స్టేషన్ అసిస్టెంట్ రైటర్ సన్నిధి జయరామ్, కానిస్టేబుల్ రజాక్ ఆదివారం పెండింగ్‌లో ఉండిపోయిన ఫైల్స్‌ను 76 శాతం నమోదు చేశారు. ఈ మేరకు వారిని రివార్డులతో సత్కరించారు. అందరూ చక్కగా పనిచేసి శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు సంతోష్, శివ పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరం నేడు

మహారాణిపేట: జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడతలో భాగంగా మంగళవారం భీమిలి మండలం రాజుల తాళ్లవలస, శింగనబందలో వైద్య శిబిరం నిర్వహించనున్నారు. పలువురు నిపుణులైన వైద్యులు శిబిరానికి వస్తారని, వారి సేవలను గ్రామస్తులు వినియోగించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు. రోగులకు ఉచితంగా మందులు అందజేస్తామని, అవసరమైతే మెరుగైన వైద్యం కోసం కార్పొరేట్ ఆస్పత్రులకు రిఫర్ చేస్తామని తెలిపారు.

'స్పందన'కు పది అర్జీలు

కొమ్మాది : జీవీఎంసీ మధురవాడ జోన్ – 2 లో జెడ్సీ శైలజ వల్లి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన స్పందనకు వివిధ సమస్యలపై పది అర్జీలు వచ్చాయి. ఎలక్ట్రికల్, పబ్లిక్ హెల్త్, యూసీడీ, ప్రణాళిక విభాగాలకు సంబంధించి ఒక్కొక్కటి, రెవెన్యూ విభాగానికి చెందినవి 4, ఈఈ వర్క్స్‌కు సంబంధించి 2 వినతులు వచ్చాయని, పరిష్కారానికి చర్యలు చేపడతామని జెడ్సీ తెలిపారు.

కృషితో లక్ష్య సాధన



విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న ప్రతినిధులు

ఆనందపురం : విద్యార్థులు తమ లక్ష్యాలు చేరుకునేందుకు నిరంతరం శ్రమించాలని ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ ఎస్ఎల్ రావు సూచించారు. మండలంలోని శొంఠ్యాం ఉన్నత పాఠశాలలో సోమవారం వృక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు కెరీర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్ఎల్ రావు మాట్లాడుతూ పాఠశాల దశ ఎంతో కీలకమని, నిర్లక్ష్యం చేస్తే బంగారు భవిష్యత్తు కోల్పోతారని చెప్పారు. వృక్ష ఫౌండేషన్ అధ్యక్షుడు కాకర సురేష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై దృష్టి సారించి పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. అనంతరం పరీక్షా సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ బి.బంగారురాజు, ఉపాధ్యాయులు కన్నారావు, గుప్తా, రామ్మోహన్‌రావు, రమేష్, ఫౌండేషన్ సభ్యులు సాడి పవన్, నాయుడు, సాయి పాల్గొన్నారు.

ప్రభుత్వ హాస్టల్ భవనంపై టీడీపీ పోస్టర్లు



తగరపువలస సాంఘిక సంక్షేమ బాలుర కళాశాల వసతి గృహం భవనంపై టీడీపీ ప్రచార పోస్టర్

తగరపువలస : బైపాస్ రోడ్డులోని సాంఘిక సంక్షేమ ప్రభుత్వ కళాశాల బాలుర వసతి గృహాన్ని టీడీపీ నాయకులు ఆ పార్టీ ప్రచారానికి వినియోగించుకోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల ఈ వసతి గృహం వద్ద ప్రభుత్వం మరమ్మతులు చేపడుతోంది. రాజకీయ పార్టీలు తమ ప్రచారానికి ప్రభుత్వ ఆస్తులు, ఆలయాలు వినియోగించకూడదని నిబంధన వున్నా... అందుకు భిన్నంగా టీడీపీ నాయకుడు భరత్ పలుచోట్ల అనుమతి లేకుండా ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులపై పోస్టర్లు అతికించుకున్నారు. ఈ చర్యల కారణంగా స్థానికులు మండిపడుతున్నారు. పార్టీ ప్రచారానికి ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులు ఖరాబు చేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నిస్తున్నారు. టీడీపీ పోస్టర్లు అతికించిన వారిపై జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఎన్నికల నియమావళిపై సమావేశం



రాజకీయ పార్టీల నాయకులతో సమావేశంలో ఆర్డీవో భాస్కరరెడ్డి

తగరపువలస : త్వరలో రానున్న ఎన్నికల నోటిఫికేషన్‌కు సంబంధించి ఎన్నికల నియమావళిపై సోమవారం భీమిలి ఆర్డీవో ఎస్.భాస్కరరెడ్డి వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. నోటిఫికేషన్ వెలువడిన తర్వాత అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేసే సమయంలో తమతోపాటు నలుగురు వ్యక్తులను మాత్రమే అనుమతించనున్నామన్నారు. ఆన్‌లైన్‌లో నామినేషన్ దాఖలు చేసే సౌకర్యం కూడా ఈ సారి కల్పిస్తున్నామన్నారు. ఈవీఎంలో ఓటు వేసిన తర్వాత ఓటరు తాను ఏ గుర్తుపై ఓటు వేశానో 7 సెకన్లపాటు చూసుకునే సౌకర్యం ఈ సారి వుందన్నారు. 80 శాతం అంగవైకల్యం కలిగిన దివ్యాంగులు ఇంటి నుంచే ఓటు వేసే విధంగా ఎన్నికల కమిషన్ సడలింపు ఇచ్చిందన్నారు. దీనికోసం ముందుగా దరఖాస్తు చేసుకోవాల్సి వుంటుందన్నారు. వీటిపై నోటిఫికేషన్ తర్వాత ఎన్నికల సంఘం యాప్‌లో విడుదల చేస్తుందన్నారు. ప్రతి పోలింగ్ బూత్‌లో తాగునీరు, ఫ్యాన్లు, విద్యుత్ సరఫరా, ఫర్నీచర్ వుండేలా చర్యలు చేపడుతున్నామన్నారు. సమావేశంలో రాజకీయ పార్టీల నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి, భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.

• శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం గరుడసేవ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వెండి గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్టింపజేశారు. అష్టోత్తర శతనామావళి పూజ చేసి భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

మేము సిద్ధం... మా 'బూత్' సిద్ధం

ఉత్సాహంగా వైఎస్సార్ సీపీ బూత్ కమిటీల ప్రచారం

తగరపువలస : జీవీఎంసీ భీమిలి జోన్ 1, 2 వార్డులు, భీమిలి మండలంలోని పలు పంచాయతీల్లో ''మేము సిద్ధం... మా బూత్‌లు సిద్ధం'' కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ సీపీ బూత్ కమిటీల కన్వీనర్లు, నాయకులు, గృహసారథులు ఉత్సాహంగా ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాగిస్తున్న సంక్షేమ పాలన, గతంలో టీడీపీ పాలనలో అమలు చేసిన పథకాలను లబ్ధిదారులకు వివరించారు. ప్రస్తుతం లంచగొండితనం లేకుండా అర్హులందరికీ సీఎం జగన్ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ప్రచారం చేశారు. గతంలో టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీలకు నచ్చిన వారికే పథకాలు అందించారని గుర్తు చేశారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కొనసాగాలన్నా, వలంటీర్, సచివాలయ వ్యవస్థలు వుండాలన్నా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం వుందని వివరించారు. కార్యక్రమంలో భాగంగా ఆదర్శనగర్‌లో సరగడ నాగిరెడ్డి, చేట్ల శ్రీనివాసరెడ్డి, చేట్ల నరసింగ్‌రెడ్డి, చేట్ల ఎల్లయ్యరెడ్డి, జీరు పద్మ, మద్ది మహాలక్ష్మి, దుర్రి రామయ్యమ్మ, కొయ్య వెంకటలక్ష్మి ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. సంతపేట సచివాలయం పరిధిలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ రమణ, కన్వీనర్ సృజన తదితరులు పాల్గొన్నారు. కుమ్మరి వీధి, రెడ్డివీధిలో ఇంటింటా ప్రచారంలో 2వ వార్డు ప్రధాన కార్యదర్శి శిల్లా వంశీరెడ్డి, జగన్నాథ ఎల్లాజీ, సరగడ నాగిరెడ్డి, చేట్ల ఎర్రయ్య, పైడిరాజు, పైడి ఎల్లారావు, చిల్ల ప్రమీల, కృష్ణవేణి, చేట్ల అప్పలసూరమ్మ పాల్గొన్నారు.

భీమిలి మండలం మజ్జివలస పంచాయతీలో వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, సర్పంచ్ తుపాకుల ఆదిలక్ష్మి, నాయకులు తుపాకుల అప్పలరాజు, పూసర్ల ఎర్రయ్య, తుపాకుల అప్పలస్వామి, తుపాకుల సురేష్, కొయ్య రామకృష్ణారెడ్డి తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు. రేఖవానిపాలెం పంచాయతీలో సర్పంచ్ సమ్మిడి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ పీతల గంగ శ్రీను, మల్లేటి హరి, పలపాల పద్మ పాల్గొన్నారు.



ఆదర్శనగర్‌లో బూత్ కమిటీ ప్రతినిధుల ప్రచారం



మజ్జివలసలో ఇంటింటా ప్రచారంలో వైస్ ఎంపీపీ బంగారునాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు



సంతపేట సచివాలయం పరిధిలో ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవీ రమణ, తదితరుల ప్రచారం



రేఖవానిపాలెం పంచాయతీలో ప్రచారం చేస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావు, తదితరులు



కుమ్మరివీధిలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ రెండో వార్డు నాయకులు

మహిళా మార్టులో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు

పద్మనాభం: ప్రకృతి వ్యవసాయ విభాగం, స్వయం సహాయక సంఘాల సహకారంతో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ఉత్పత్తులను సోమవారం మహిళా మార్టులో అందుబాటులో వుంచారు. పది రకాల కూరగాయలు, నాలుగు రకాల పప్పు దినుసులు అందుబాటులో ఉంచారు. ప్రతీ సోమవారం వీటిని కొనుగోలుదారుల కోసం తీసుకురానున్నారు. ఈ ఉత్పత్తులను ఏపీసీఎన్ఎఫ్ ఎన్‌సీఆర్ టీఎల్ శ్రీ ప్రకాష్, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం ప్రభాకర్, సీపీ సురేష్, ఆర్ఐ కోటేశ్వరరావు పరిశీలించారు.

బాలిక అదృశ్యంపై కేసు

పీఎం పాలెం: బాలిక అదృశ్యంపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. ఇందుకు సంబంధించి పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం... పీఎంపాలెం రెండో బస్టాపు సమీపంలో ప్రభురామ్ చౌదరి గిఫ్ట్స్ షాపు నడుపుకుంటున్నారు. అతనికి కుమారుడు, ఇద్దరు కుమార్తెలు సంతానం. తండ్రికి సాయంగా షాపులోనే కుమార్తెలు పని చేస్తున్నారు. చిన్నకూతురు(17) ఈ నెల 7న సాయంత్రం స్నాక్స్ కోసమని షాపు నుంచి వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ రామకృష్ణ తెలిపారు.

ఇంటర్వ్యూలో 8 మంది ఎంపిక

ఆనందపురం : మండలంలోని గిడిజాలలో ఉన్న సాయిగణపతి పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 8 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. బ్యాటరీల తయారీ సంస్థ అమర్‌రాజా సంస్థ ఇంటర్వ్యూలు నిర్వహించి ఎనిమిది మందిని ఎంపిక చేసింది. కార్యక్రమంలో కంపెనీ హెచ్‌ఆర్ మేనేజర్ హరిప్రసాద్, కళాశాల కరస్పాండెంట్ వేణుగోపాల్, ప్రిన్సిపాల్ మహేశ్వరరావు, మెకానికల్ విభాగాధిపతి రాజేంద్రప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ అమరేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అజాగ్రత్తగా డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు

సింహాచలం: అజాగ్రత్తగా డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జోన్-2 ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్ కుమార్ అన్నారు. అడవివరం నుంచి గోపాలపట్నం మార్గంలో ఇటీవల జరిగిన రెండు రోడ్డు ప్రమాదాల్లో ద్విచక్రవాహనదారులు మృతి చెందడంతో హెవీ వెహికల్ డ్రైవర్లు, యజమానులకు సింహాచలంలోని ఒక కల్యాణమండపంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. నిర్ణీత సమయంలో మాత్రమే అడవివరం మార్గంలో హెవీ వెహికల్స్‌కి అనుమతి ఉంటుందని, ఆసమయాల్లోనే రాకపోకలు సాగించాలని సూచించారు. ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా నిబంధనలు పాటిస్తామని ప్రమాణం చేయించారు.

ఉత్సాహంగా 'ఆడుదాం రండి'



దాకమర్రి హైస్కూల్‌లో విద్యార్థులతో వలంటీర్లు

తగరపువలస : భీమిలి మండలం దాకమర్రి రఘు ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం 'ఆడుదాం రండి' కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. డ్రాపౌట్ విద్యార్థులను బడికి తీసుకెళ్లేందుకు ఉద్దేశించిన ఈ కార్యక్రమం ద్వారా చిన్నారులకు విద్యపై ఆసక్తి కలిగించినట్టు ప్రోగ్రాం కన్వీనర్ బి.ఎస్.వెంకటరెడ్డి తెలిపారు. హైస్కూల్ అవసరాలను గుర్తించి విద్యాప్రమాణాలు, పరిశుభ్రత, ఆటస్థలంపై విద్యార్థులతో చర్చించారు. ఆటస్థలం అభివృద్ధికి చర్యలు ప్రారంభించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ విలువలు, సామాజిక బాధ్యత, వాస్తవికత, విశ్వసనీయతపై అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని కళాశాల చైర్మన్ రఘు కలిదిండి, డైరెక్టర్ రాహుల్ సందర్శించి వలంటీర్లను అభినందించారు.